


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 636 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర ఆదివారం 11 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

# సంక్రాంతి రష్...

## హైదరాబాద్-విజయవాడ మధ్య 10 స్పెషల్ రైళ్లు

**-సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా 10 ప్రత్యేక రైళ్లు**
**-హైదరాబాద్, విజయవాడ మధ్య నడవనున్న సర్వీసులు**
**-జనవరి 11 నుంచి 19 వరకు పలు తేదీల్లో రాకపోకలు**
**-రిజర్వేషన్ లేని వారి కోసం అధికంగా జనరల్ బోగీలు**



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. పండగ కోసం సొంత ఊళ్లకు వెళ్లేవారి సౌకర్యార్థం హైదరాబాద్ - విజయవాడ మధ్య మొత్తం 10 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు పండగకు ముందు, తర్వాత రోజుల్లో రాకపోకలు సాగించనున్నాయి.

ఈ ప్రత్యేక రైళ్లలో చైర్ కార్ బోగీలతో పాటు జనరల్ బోగీలు కూడా ఉంటాయి. ముఖ్యంగా, రిజర్వేషన్ లేకుండా ప్రయాణించే వారిని దృష్టిలో ఉంచుకుని సగానికి పైగా జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. చైర్ కార్ బోగీలలో ప్రయాణించాలనుకునే వారు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ముందస్తుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు.

**రైళ్ల షెడ్యూల్ వివరాలు:**

హైదరాబాద్ నుంచి విజయవాడకు జనవరి 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6:10 గంటలకు రైలు బయలుదేరుతుంది. అదేవిధంగా, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు జనవరి 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2:40 గంటలకు రైలు అందుబాటులో ఉంటుంది.

సంక్రాంతి సమయంలో సాధారణ రైళ్లపై ఒత్తిడి తగ్గించేందుకే ఈ అదనపు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు



## అమరావతి ఐకానిక్ టవర్లు చాలా విశాలంగా ఉంటాయి

### -మంత్రి నారాయణ

ఏపీ రాజధాని అమరావతిని నదీగర్భంలో నిర్మిస్తున్నారంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారాయణ విమర్శలు గుప్పించారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన నగరాలెన్నో నదుల ఒడ్డునే ఉన్నాయని... నదీగర్భంలో అమరావతి అంటూ అవగాహన లేకుండా జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతిలో నిర్మిస్తున్న సచివాలయాన్ని హైదరాబాద్ లోని సెక్రటేరియట్ తో పోల్చి చూడటం సరికాదని అన్నారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, వారి సిబ్బంది అంతా ఒకే చోట ఉంటారని... అందుకే అమరావతిలో సెక్రటేరియట్ ఐకానిక్ టవర్లు చాలా విశాలంగా ఉంటాయని చెప్పారు. ఎంతో దూరదృష్టితో అమరావతి నిర్మాణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టారని కొనియాడారు



## ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోంది

పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలామంది ప్రాణాలు కాపాడవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్‌నని అన్నారు.


ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాలసీలను మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఇందుకోసం వైద్యులు సూచనలు ఇవ్వాలని కోరారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పుడూ మరిచిపోకూడదని అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, అదే సమయంలో ప్రజల నాడిని పట్టుకోవడం మరిచిపోవద్దని సూచించారు.

గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఆరోగ్య రంగంలో ఆవిష్కరణల్లో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ముఖ్యమంత్రి అన్నారు.

**రాజధానిపై వైసీపీ ఇంకా**

## విషం చిమ్ముతోంది

**జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదులపై దుష్ప్రచారం చేయరని వ్యాఖ్యలు**
**రెండు తెలుగు రాష్ట్రాలు నీటి కోసం గొడవ పడొద్దన్న చంద్రబాబు**
**పట్టిసీమతోనే రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి చెందిందని వెల్లడి**
**గత ప్రభుత్వం రూ.900 కోట్ల బిల్లులు చేసుకుందని ఆరోపణ**



మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదుల గురించి ఇలా దుష్ప్రచారం చేయరని, అసలు సింధు నాగరికత ఎలా ఏర్పడిందో తెలుసుకుంటే మంచిదని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలైన దేశ రాజధాని దిల్లీ, లండన్ వంటివన్నీ నదీ తీరాల వెంబడే అభివృద్ధి చెందాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నదీ గర్భం నదీ పరివాహక ప్రాంతం కు కనీస తేడా తెలియకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమకు బుద్ధి చెప్పినా రాజధాని విషయంలో ఇప్పటికీ విషం చిమ్మడం మానలేదని విమర్శించారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన చంద్రబాబు, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. నీటి విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు పడితే అంతిమంగా నష్టపోయేది తెలుగు ప్రజలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. "రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుంది? తెలంగాణతో కలిసి సహకరించుకుని మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయి" అని సూచించారు. నీటిని సమర్థవంతంగా వాడుకోవడం వల్లే రాయలసీమ స్వరూపం మారిందని, పట్టిసీమ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే రాయలసీమలో ఉద్యాన విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం దేశంలోనే ఉద్యాన (హార్టికల్చర్) రంగంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కేవలం స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఆపేసిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 2020లో కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్ల బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో నీటి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత అనేదే లేకుండా చూసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

**జనసేన పార్టీ కీలక నిర్ణయం...**

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ

జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ జనసేన విభాగం నిర్ణయించింది. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన నిర్ణయించింది. ఈ మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పేరుతో ప్రకటన విడుదలైంది.


తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే దిశగా, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో పార్టీ ఇప్పటికే కార్యాచరణను ప్రారంభించిందని ఆ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, సాధ్యమైనన్ని స్థానాలలో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడం, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భావజాలాన్ని, ఆయన ఆశయాలను, తెలంగాణ ప్రాంతం పట్ల ఆయనకున్న అనుబంధాన్ని ప్రజలకు చేరవేయడం, తద్వారా తెలంగాణలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తున్న జనసైనికులు, వీరమహిళలు చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు



# భజన ఎందుకు చేయాలి...?

## - భజన వల్ల ఆరోగ్యానికి మేలు...!

భజన వల్ల మనసు, నాడీవ్యవస్థ ఉత్తేజితమవుతాయి. సామూహికంగా భగవన్నామావళిని లయబద్ధంగా గొంతు కలిపినపుడు మనసు అలౌకిక ఆనందంలో తేలుతుంది. పదిమందితో కలిసినపుడు తాత్కాలికంగా సమస్యలన్నీ మరచి, భగవంతుని భజించడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుంది. అలసటను మరచిపోయి నూతన ఉత్తేజం పొంది ఉత్సాహవంతులు అవుతారు. పాటలకు అనుగుణంగా తాళం వేయడం, పాడే వారితో గొంతు కలిపి, భక్తిపారవశ్యంలో ఓలలాడటం ద్వారా మానసికానందంలో మునిగి తేలుతారు. భజనవల్ల హృదయస్పందన బాగుంటుంది. గుండె పనితీరు మెరుగుపడుతుంది. దురాలోచనలు దూరమై, చైతన్యం పెరుగుతుంది. రెండుచేతులూ కలవడం వల్ల నాడులు ఉత్తేజమవుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది.




క్రమపద్ధతిలో సాగే శృతిలయల వల్ల ఆల్ఫా, తీటా, డెల్టా తరంగాలు విడుదలవుతాయి. శరీరం విశ్రాంతి స్థితిలోకి వెళుతుంది. మనసుకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.

# ఉప సర్పంచ్ భీమన్న ను శాలువాతో సన్మానించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

(ప్రతినిధి నాగల్ గిద్ద)

నాగల్ గిద్ద మండల పరిధిలోని ఉటుపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఇటీవల ఉప సర్పంచ్ గా ఎన్నికైన భీమన్న కు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీమన్నతో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి వార్డు మెంబర్లు నర్సారెడ్డి, నాందేవ్, బసవరాజ్, ఏక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్

నాగల్ గిద్ద

నాగల్ గిద్ధ మండల పరిధిలోని ముక్టపూర్ గ్రామంలో వివేకానంద జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ సుభాస్ చంద్రబోస్, నాగల్ గిద్ధ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాణిక్ రావు పటేల్ అధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం చేసినారు. ముక్టపూర్ గ్రామ సర్పంచ్ సుభాస్ చంద్రబోస్, నాగల్ గిద్ధ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. మాణిక్ రావు పటేల్ మాట్లాడుతూ యువత వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని క్రీడల్లో చురుగ్గా పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం చేయాలని కోరారు.

# సమాజములో పత్రిక పాత్ర గొప్పది

## -పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాకూరి వెంకటేశం

జోగిపేట)

సమాజములో పత్రిక పాత్ర గొప్పది శనివారం నాడు జోగిపేట పట్టణంలో మన తెలంగాణ దినపత్రిక నూతన ఆవిష్కరణ కార్యక్రమంలో భాగముగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాకూరి వెంకటేశం మాట్లాడుతూ నేటి సమాజములో పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి పాత్ర పోషిస్తాయి అన్నారు పత్రికలు పక్షపాత ధోరణి చూపించవద్దు అన్నారు అవినీతి నిర్మూలనలో పత్రికలు కీలకపాత్ర పోషించి ప్రజలను ఉత్తేజపరిచి సమాజ నిర్మాణానికి కృషిచేయాలి అన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమములో మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజ్ నాని,ప్రముఖ వ్యాపారవేత్త సారా శివకుమార్,నాయకులు కోశికే రాజశేఖర్, గుర్రపు కృష్ణ, బేగారి అనిల్, ఆకుల నందు,తగితరులు పాల్గొన్నారు

# ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు లింగంపల్లి కళాకారుడు

జోగిపేట్

అందోల్ నియోజకవర్గం పరిధిలోని చౌటకూర్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన డబ్బు కళాకారుడు అరవింద్ కుమార్ కు అరుదైన గౌరవం లభించింది. ఢిల్లీలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో డప్పు ప్రదర్శన ఇచ్చేందుకు నాగపూర్ సౌత్ సెంట్రల్ కల్చర్ జోన్ నుండి ఉస్మాన్ బిస్మిల్లా కాల్ యువ పురస్కార గ్రహీత అందే భాస్కర్ గారి నేతృత్వంలో జరిగే కార్యక్రమానికి తెలంగాణ నుండి బేగరి అరవింద్ కుమార్ కు ఆహ్వానం అందింది. రాష్ట్రపతి ఉపరాష్ట్రపతి ప్రధానమంత్రి ఇతర ప్రముఖులు పాల్గొని ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కళాకారులలో చౌటకూర్ కళాకారుడు ఎంపిక అవడంపై లింగంపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబం నుండి ఉన్నత చదువులు చదువుతున్న తార డిగ్రీ కాలేజ్ సంగారెడ్డిలో డిగ్రీ సెకండ్ ఇయర్ దీూజుజూ ఫార్మసీ అభ్యసిస్తున్న అరవింద్ కుమార్ కు గ్రామ సర్పంచ్ బ్యాగరి రాజు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఒక్కరోజు దేవోక్తుల ధ్యాన సదస్సు విజయవంతం

సంగారెడ్డి)

ఇన్స్టిట్యూట్ అఫ్ బైబిల్ టెక్నాలజీ సంగారెడ్డి ఆధ్వర్యంలో పరలోకరాజ్యమే పరలోకానికి మార్గమా అనే అంశం పైన ఒక్కరోజు దేవోక్తుల ధ్యాన సదస్సు సంగారెడ్డి తెలంగాణ భవనం లో నిర్వహించడం జరిగింది..ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హైదరాబాద్ ఇన్స్టిట్యూట్ అఫ్ బైబిల్ సొసైటీ హైదరాబాద్ నుండి డాక్టర్ బొంకూర్ జాన్ ముఖ్య అతిధిగా వచ్చారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంఘంలో ఉన్నవారు ఆత్మీయంగా తగ్గింపు కలిగిండి ఒకరినొకరు ప్రేమగా కలిసి ఉండాలి అన్నారు. నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలన్నారు. ఈ కార్యక్రమం లో పాస్టర్స్ అమరపాల్, మోషే, జైపాల్, వరుణ్ కుమార్ పౌల్, రవిచంద్ర, ఈశ్వర్ రావు, కిరణ్ కుమార్, ప్రసాద్, అనిల్, స్వామినాథ్, మారుతీ, చంద్రశేఖర్, రవీందర్, ప్రశాంత్ పెద్దాపురం దుర్గయ్య,చవాన్ సుభాన్ సింగ్.తదితరులు పాల్గొన్నారు



# స్వేచ్ఛా సింధూర్

ఎన్ని కన్నీటి బొట్టులో
ఎంతటి రుధిర ప్రవాహమో
శరీరాన దిగిన ఎన్ని వేల తూటాలో
వందేమాతరం అంటూ నేలకొరిగిన ఎన్ని గొంతుకలో
అణువణువు ధైర్యాన్ని నింపుకుని
తన దేశం కోసం పిడికిలి బిగించిన ఎన్ని కోట్ల హస్తాలో
తెల్లవాడి రక్కసి చూపులలో నలిగిపోయిన భరతమాతలెందరో
ఈ భారత దేశ స్వతంత్ర సమయాన...

ఒక్కో అక్షరం చదివితే కంట కన్నీరు తిరగకుండా ఉండదు, గుండెల్లోని రుధిరం ఆవేశంతో పరుగులు పెట్టకుండా ఆగదు, పరిస్థితిని కనులకు కట్టినట్లు చూపించడం అతని కలానికి అలవాటు కాబోలు, ఒక్కో పదం పదనిసలు పలికిస్తుంది, ఒక్క పంక్తి అర్థవంతమైన భావాలకు అనుగుణంగా ఆకర్షిస్తుంది...

- ఇక కవిత్వం విషయానికి వస్తే

- శీర్షిక : ముువ్వన్నెల జెండా

ముువ్వన్నెల జెండా అంటే

బీరువాలో దాచిన గుడ్డముక్క కాదు
గతకాలపు పోరాటాలు
తుడిచిన రక్తపు మరకలు
దారపోసిన జీవితాల
స్వచ్ఛమైన ఆశయాలు
దేశభక్తితో కదిలిన
త్యాగాల చైతన్యపు లోగిల్లు

దిశదిశలు ఒక్కటైన ఉక్కుపిడికిళ్ళు
జాతి హృదయపు స్పందనలు
జాగృతి కోసం కదం తొక్కిన ప్రాణాలు
తూటాలకు గుండెను అడ్డుపెట్టిన ఘర్జనలు
ఉరి కంబాన్ని ముద్దాడిన ధైర్యపు చిరునామాలు
లేత వయసునే అర్పించిన యువతరం ఆయువులు
శక్తిగా మారిన స్త్రీ మూర్తుల త్యాగాలు
ఇనుప లాఠీల దెబ్బలు
ఇరుకుతో కిక్కిరిసిన జైలు జీవితాలు
వదులుకున్న అదృష్టాలు
సాధించు లేదా మరణించు అనే తెగింపులు
విప్లవం ఘోషించిన విజయపు నాదాలు

ఇన్నీ కలిసి ఒక్కటై
నడిచిన దశాబ్దాల పోరాటం మన జెండా
జనగణమన అని పాడే భరతమాత అజెండా
ఈ స్వాతంత్ర్యం
మన అందరి స్వేచ్ఛ సింధూరం
జై హింద్.

- రచయిత : శ్రీఅరుణం శ్రీనివాస్

- సమీక్ష

ముువ్వన్నెల జెండా అంటే
బీరువాలో దాచుకునే గుడ్డ ముక్క కాదు, గత కాలపు పోరాటాలు, రక్తపు మరకలు, దార పోసిన జీవితాలు, స్వచ్ఛమైన ఆశయాలు, దేశభక్తితో కదిలిన త్యాగాలు, జనుల జీవిత చైతన్యపు లోగిళ్లు
అంటూ అభ్యుదయ భావాన్ని వలకపోసి
భారత స్వాతంత్రం కోసం పోరాడిన విప్లవకారుల త్యాగాలను, దేశం కోసం దారబోసిన జీవితాలను మరొకసారి గుర్తు చేస్తూ, పాఠకుల మెదళ్లలో ఆలోచన పుట్టిస్తున్నారు రచయిత.

దిశ దిశలు ఒక్కటైనా ఉక్కి పిడికిళ్ళు, జాతి హృదయపు స్పందనలు, జాగృతి కోసం కదం తొక్కిన ప్రాణాలు, తూటాలకు అడ్డుపెట్టిన గుండెలు, ఉరికంబాన్ని ముద్దాడిన ధైర్యపు చిరునామాలు, లేత వయసునే అర్పించిన యువతరం ఆయువులు, మానప్రాణాలను ఎదిరించి దేశం కోసం స్త్రీ మూర్తులు చేసిన త్యాగాలు
ఒక్కటేమిటి చెప్పుకుంటూ పోతే
ఈ భరత భూమిలో,
ఎన్ని రణాలో,
పరదేశీయుల నుంచి మన దేశాన్ని కాపాడుకోవడం కోసం ఎన్ని కోట్ల మరణాలో,
ఎన్ని చీదరింపులో,
ఎన్ని కొరడా దెబ్బలో,
ఎన్ని చీత్కారాలో,
ఎన్నో సంవత్సరాల నిద్రలేని రాత్రులో
ఒక్కో పదంలో ఎంతో అన్యాయాన్ని, అక్రమాలను, దౌర్జన్యాలను కనులకు కట్టినట్లు చూపిస్తున్నారు రచయిత, భౌతికంగా అనుభవించకపోయినా వాస్తవాలను గ్రహించి, యదార్థ ఘటనను ఔన్నత్యంతో చూపించారు...

ఇనుప లాఠీల దెబ్బలు, ఇరుకుతో కిక్కిరిసిన జైలు జీవితాలు, వదులుకున్న అదృష్టాలు, సాధించు లేదా మరణించు అనే నినాదాలు, విప్లవం ఘోషించిన విజయ నాదాలు...
అన్నీ కలసి ఒక్కటై నడిచిన దశాబ్దాల పోరాటం మన జెండా జనగణమన అని పాడే భరతమాత అజెండా అంటూ రెపరెపలాడే మూడు రంగుల జెండాలో దాగున్న భారతమాత స్వేచ్ఛను, ఎంతో ఉన్నతంగా వర్ణించారు...

ఈ స్వాతంత్రం మన అందరి స్వేచ్ఛ సింధూరం అంటూ, తెలుగువాడికి వన్నె తెచ్చే సింధూరాన్ని పరమార్థంగా పోల్చడం ఎంతో గొప్ప విషయం, అందుకే ఈ రచయితకు, వారి రచనలకు సాటి ఎవరూ లేరు, రాబోరు...

ఉన్నతమైన మీ ఆలోచనకు, అక్షరాలను సమకూర్చిన మీ ప్రతిభకు, ఔన్నత్యం కలిగిన మీ విశ్లేషణకు హృదయపూర్వక అభినందనలు...




సమీక్ష : పోలగాని భాను తేజశ్రీ

# గుంపు

తన స్వరాన్ని కోల్పోయిన మనుషుల
సురక్షిత సమాధి గుంపు.
అక్కడ ఆలోచన కాకుండా
అనుకరణే ధర్మం.!

మూక నడిచే దారి
నాకు చీకటి...!
ఆ ప్రవాహంలో నాకు
నేల కనిపించనే లేదు.!

సముదాయానికి నేను దూరం కాదు..
సమూహం నా ఎత్తుకు రాలేని చోటనే
నేను నిలబడ్డాను.!

మందలో మనిషి
తన విలువలను అద్దెకు ఇస్తాడు.!
అవివేకాన్ని నీతిగా,
బలహీనతను ధర్మంగా..
కరతాళధ్వనితో అమ్ముకుంటాడు.!
అక్కడ 'సత్యం'
ధైర్యం కోల్పోయిన భాష.!

ఒంటరిగా నిలబడటం
నాకు శిక్ష కాదు..
ఇది నా ఉనికిని
నా చేతనే సృష్టించుకునే ఔన్నత్యం.!
ఓటమిని సైతం
జయంలా మలుపుతాను
అది నా లోతు,
నా అధిగమనం.!

మూక ఎప్పుడూ గెలుస్తుంది..
ఎందుకంటే అది
తలవంచిన వారి రాజ్యం.!
కానీ శిఖరానికి
మందలు చేరవు.!
ఒక్క ఒంటరి అడుగే
అంతిమ సత్యానికి దారి చూపుతుంది.!

గుంపు గుసగుసలు
నన్ను తాకలేవు..
నా మౌనం దాని కంటే
బలంగా గర్జించగలదు!

నేను ఓడినా పర్వాలేదు.
బలహీనుని వైపే నిలబడుతాను
బక్కోడి కోసమే కలబడతాను
అది నా రక్తం రాసుకున్న ప్రమాణ పత్రం!

-
మామిడి అమరేందర్

7780353511



# శ్రీవాణి విద్యానికేతన్ లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

## - ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

తాళ్లరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 10 : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పరిధిలోని పి.మల్లవరం గ్రామంలో గల శ్రీ వాణి విద్యానికేతన్ లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్లు ధూళిపూడి వెంకన్న బాబు, ధూళిపూడి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు వేసి ముగ్గులలో బొబ్బెమ్మలు పెట్టి, భోగిమంటలతో సంక్రాంతి ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే డూడు బసవన్న, సోది, గంగిరెద్దుల, హరిదాసుల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. అలాగే వివిధ రకాల పిండివంటల ప్రదర్శనతో పాటు బొమ్మల కొలువును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ మేనేజర్ ఉంగరాల రవి, స్కూటీ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, దేవాదాయ శాఖ మాజీ చైర్మన్ దూళిపూడి సుబ్బారావు, ధూళిపూడి వెంకటరమణ, వేపకాయల రామచంద్రరావు, ఉంగరాల బాబి సత్యనారాయణ, ఉంగరాల మని,



దూలపూడి భవ్య సునంద , తదితరులు పాల్గొని ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అన్న తరహాలో పాఠశాలలో ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కాకినాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరావు అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు పోటాపోటీగా తమ ప్రతిభను చాటారని, వారందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

# సమీక్షలు తప్పా పనులు జరగవా....?

## మొదలైన పనులకు మళ్ళీ అంచనాలు తయారుచేయడమా?

## టెండర్లు పూర్తయ్యి పనులుమొదలాయ్యాక మళ్ళీ అంచనాలెందుకు?

## కాలువల మరమ్మాత్తులు లేనట్టేనా?-సంగమేశ్వర బసవేశ్వర ఎందుకు రద్దు చేశారు.

## అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రశ్న

జోగిపేట)
అందోల్ నియోజకవర్గం లో ఇరిగేషన్ శాఖ పనులపై మంత్రి రాజనర్సింహా సమీక్ష తూ తూ మంత్రంగా జరిగినట్టుందని, ఆ సమీక్ష కమీషన్ ల పెంపుకోసమే అన్నట్టు ఉందని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆరోపించారు. సింగూరు కాల్వల మరమ్మత్తులకు తాజా అంచనాలు తయారుచేయండి అని మంత్రి అధికారులను ఆదేశించినట్టు పత్రికల్లో చూడటం జరిగింది. అయితే ఈ కాల్వల పనులకు టెండర్ లు గతంలోనే పూర్తయ్యాయి, కొంతవరకు పనులు జరిగాయి కానీ ఇప్పుడు ఆగిపోయాయి. టెండర్లు పూర్తి అయ్యి పనులెందుకు ఆగిపోయాయో రివ్యూ పెట్టకుండా మళ్ళీ అంచనాలు తయారుచేయండి అని ఆదేశించడం వెనకాల వున్న మతలబు ఏంటని ఆయన మంత్రి దామోదర ను ప్రశ్నించారు. దామోదర రాజనర్సింహా గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మారమ్మత్తుల పేర రెండేళ్లు కాలువ నీళ్లు వదలలేరు పైగా రైతులు పంట పండించకుండా క్రాప్ హాలీడే ప్రకటించారు. ఈ రెండేళ్లకాలంలో పనులు పూర్తిచేయకుండా ఎందుకు కాలయాపన చేశారని క్రాంతికిరణ్ ధ్వజమేత్తారు. నియోజకవర్గం ను సస్యశామలం చేసే సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్ట్ లను ఎందుకు ఆపారో నోయోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సింగూర్ కాలువలు సంగమేశ్వర బసవేశ్వరా లిఫ్ట్ ల సాధనకై త్వరలో



కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆ రెండు పథకాలను ఈ నెల 12న ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారుల సంక్షమాన్ని లక్ష్యంగా చేసుకుని మరో కీలక ముందడుగు వేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులు, వృద్ధులు, ఐదేళ్లలోపు చిన్నారుల అభ్యున్నతి కోసం రూపొందించిన 'భాల భరోసా' మరియు 'ప్రణామం' పథకాలను ఈ నెల 12న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు. సంక్షమ రాష్ట్రంగా తెలంగాణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక పథకాలకు శ్రీకారం చుట్టింది.

**దివ్యాంగుల సాధికారతకు రూ.50 కోట్ల కేటాయింపు**

దివ్యాంగుల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లను కేటాయించింది. ఇందులో భాగంగా రూ.43.22 కోట్ల విలువైన సహాయక పరికరాలను సుమారు 7 వేల మంది అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఈ పరికరాల్లో రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు ఉన్నాయి.దివ్యాంగుల సహకార సంస్థ ఏర్పాటైన తర్వాత, ఒకే ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారి కావడం విశేషంగా నిలుస్తోంది. దివ్యాంగులు స్వావలంబనతో జీవించేందుకు ఇది కీలకంగా దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రణామం -- వృద్ధుల కోసం మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లు**

వృద్ధుల మానసిక ఉల్లాసం, భద్రత, సంరక్షణ లక్ష్యంగా 'ప్రణామం' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 37 మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, హన్మకొండ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగిలిన 29 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.
ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసే ఈ డే కేర్ సెంటర్లలో లైబ్రరీ, ఇండోర్ గేమ్స్, టీవీ, ఇంటర్నెట్



సదుపాయంతో కూడిన కంప్యూటర్లు అందుబాటులో ఉంటాయి. లబ్ధిదారులకు ఉచితంగా స్నాక్స్‌తో పాటు వేడి భోజనం అందించనున్నారు. ప్రతి సెంటర్ ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.12.48 లక్షలు మంజూరు చేసింది.

**బాల భరోసా -- చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది**

ఐదేళ్లలోపు చిన్నారుల్లో వైకల్యాలను ముందస్తుగా గుర్తించి, సమయానికి చికిత్స అందించాలనే లక్ష్యంతో 'బాల భరోసా' పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం కింద అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు ప్రాథమిక స్క్రీనింగ్ నిర్వహిస్తారు. సమస్యలు ఉన్నట్లు గుర్తించిన చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా ఆర్బీఎస్కే (=దీూఖ) ద్వారా వైద్య పరీక్షలకు పంపిస్తారు.అవసరమైన చిన్నారులకు ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు, థెరపీ, పునరావాస సేవలు అందించనుంది. చిన్న వయసులోనే వైకల్యాలను గుర్తించి చికిత్స అందించడం ద్వారా వైకల్య రహిత తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

**సంక్షమమే లక్ష్యంగా ముందడుగు**

దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారుల కోసం రూపొందించిన ఈ రెండు పథకాలు రాష్ట్రంలో సామాజిక భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోందని ఈ కార్యక్రమాలు స్పష్టం చేస్తున్నాయి.

# వికసిత్ భారత్ అంటే పేదల పొట్టిగొట్టమేన

## - విద్యుత్ ప్రైవేటికరనను ఆపాలి

## - అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## - రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షలు గొల్లపల్లి జయరాజు

పుల్కల్ (ప్రతినిధి)
కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీల కోసమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా)లో మార్పులు చేసిందని రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షలు గొల్లపల్లి జయరాజు అన్నారు. నేడు చౌటకూరు మండలంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పెట్టుబడి దారి కంపెనిలకు కారుచౌకగా కూలీలను పంపేందుకే ఇలాంటి కుట్రలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉధృత పోరాటాలు నిర్వహించటం ద్వారా విధానాలు తిప్పికొట్టగలమని అన్నారు.వికసిత్ భారత్ అంటే పేదల పొట్టగొట్టటమేనా? అని సీఎం ప్రశ్నించారు. పేదలకు అనుకూలంగా ఉన్న చట్టాన్ని మరిచి పెద్దలకు అనుకూలంగా మోడీ మారుస్తున్నారని విమర్శించారు. విద్యుత్తు ప్రైవేటీకరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను



కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు కార్మికుల కనీస వేతనం 26,000 కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు స్కీం వర్కర్స్ అందరిని కూడా రెగ్యులర్ చేయాలని అన్నారు ఆందోలు నియోజకవర్గంలో యూరియా, డిఏపి ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికులు కర్షకులు పేదలు అందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు,భూషణం రైతు సంగం నాయకులు జైపాల్ రెడ్డి, కార్మికులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు..

(జహీరాబాద్
నిషేధిత చైనా మంజాను విక్రయించినా లేదా నిల్వ ఉంచినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలుతీసుకుంటామని జహీరాబాద్ డి ఎస్పీ సైదా నాయక్ పట్టణ సి ఐ శివలింగం ఎస్ ఐ వినయ్ కుమార్ లు హెచ్చరించారు.శనివారం వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో గోడ పత్రిక ను విడుదల చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూచైనా మంజా వలన పక్షులు, జంతువులు, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడే ప్రమాదం ఉందని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ప్రభుత్వం దీనిపై పూర్తిస్థాయిలో నిషేధం విధించిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు.చైనా మంజా విక్రయాలపై ఎవరైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని తెలిపారు.




# స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయండి



మార్కాపురం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 10 : పట్టణంలోని కంభం రోడ్డులో గల బ్రహ్మంగారిమఠం రజియా సుల్తానా మసీద్ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ అవసరం ఉందని, అధికారులు పై ప్రాంతాల మూల మలుపుల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు వేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్ వలీ అధికారులను కోరారు. ఇటీవల కాలంలో పట్టణంలో అనేకచోట్ల స్పీడ్ బ్రేకర్లను అధికారులు వేశారని, కానీ అవసరమైన మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. శ్రీనివాస థియేటర్ ప్రాంతంలోని బ్రహ్మంగారి మఠం మరియు ముస్లిం స్మశాన వాటిక టర్నింగ్ పాయింట్ల వద్ద స్పీడ్ బ్రేకర్ అవసరం ఉందని, డేంజర్ జోన్ గా ఉన్న ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ వేయకపోవడం ఏమిటని..? ఆయన ప్రశ్నించారు. అలాగే పట్టణ ప్రధాన వీధులలో వేసిన సిసి రోడ్లకు మధ్య జాయింట్లలో తారు నింపకపోవడంతో వేసిన సిసి రోడ్లు ఛిద్రమవుతున్నాయని, ఖర్చును చూసుకుంటే ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ విషయాన్ని ఆర్ అండ్ బి అధికారులు గుర్తించాలని డాక్టర్ షేక్ మహబూబ్ వలీ అన్నారు. తక్షణమే పట్టణంలోని కంభం రోడ్డులోనీ మసీదు వద్ద యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# నేషనల్ హైవే రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

## -సంగారెడ్డి నుండి పటాన్చెరు వరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

## - సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి)
సంగారెడ్డి నుంచి పటాన్చెరు వరకునిర్మాణం లో ఉన్న నేషనల్ హైవే రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం సంగారెడ్డి సుందరయ్య భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సంగారెడ్డి నుంచి పటాన్చెరు వరకు నేషనల్ హైవే రోడ్డు పనులు పెండింగ్లో ఉండడం వలన ప్రజలు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గంటల తరబడి సమయం వృధా అవుతుందని అన్నారు.ఈ సమస్యను పరిష్కారం చేయడంలో నేషనల్ హైవే అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తక్షణమే నిర్లక్ష్యం గా ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంది,ఇస్నాపూర్ ముత్తంగి, పటాన్చెరు భారీగా స్థాపిక స్తంభించిపోతుందని అన్నారు. ట్రాఫిక్ సమస్య పైన పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. నర్సింలు, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు

# విజేత హై స్కూల్ లో ఘనంగా సంక్రాంతి పండుగ సంబరాలు

నారాయణఖేడ్:)
విజేత హై స్కూల్ లో ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సంక్రాంతి పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. శనివారం రోజు పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా విద్యార్థులు అందంగా ముగ్గులు వేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. అలాగే ఆటల పోటీలు, పట పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..సంక్రాంతి పండుగ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసే ముఖ్యమైన పండుగ అని అన్నారు. ఇలాంటి పండుగల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, ఆనందం, సాంస్కృతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొనాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

# సంక్రాంతి సెలవుల్లో ఇళ్ల భద్రతపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

## -జహీరాబాద్,డి ఎస్పీ సైదా నాయక్

జహీరాబాద్)
రాబోయే సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా జిల్లా ప్రజలు తమ స్వగ్రామాలకు, ఇతర పట్టణాలు మరియు దూర ప్రాంతాలకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో, ఇళ్లకు తాళం వేసి వెళ్లే సందర్భాల్లో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ డి ఎస్పీ సైదా నాయక్ ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా డి ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకుని నిరంతర పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ముఖ్యంగా నివాస ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లు, గ్రామాలు, పట్టణాల్లో గస్తీ పెంచి, రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రయాణానికి వెళ్లే ముందు తమ ఇళ్లకు సురక్షతంగా తాళాలు వేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారం ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచాలని సూచించారు. అలాగే పొరుగువారికి లేదా సమీప బంధువులకు సమాచారం ఇవ్వడం, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని తెలిపారు. దొంగతనాలను నివారించడానికి పోలీస్ అధికారుల నియమ , నిబందనలు ఖచ్చితంగా పాటించాలని డిఎస్పీ తెలిపారు అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే శాంతియుతంగా, సురక్షతంగా పండుగలను జరుపుకోవచ్చని జిల్లా డిఎస్పీ తెలిపారు






Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com